# అమ్మ

"ఇక్కడ నించున్నావా ఇంతసేపూ? అమ్మ ధనియాలు తెమ్మని పంపుతే ఇదా నువ్వు చేస్తోన్న నిర్వాకం? ఆ పాములాళ్ళ వెనకే వెళ్ళక పోయావూ?"

"పాములాళ్ళెప్పుడో వెళ్ళిపోయారే.... కమలా వాళ్ళు ఆడుకుంటున్నారనీ...."

"ఒహో! ఆ పాములాటలు కాకపోతే ఈ దొమ్మరాటలూ. ఇంటికి పద నీకు మూడిందిలే. అమ్మ తెగ తిట్టిపోస్తోంది."

"నిజంగానా అక్కా? అమ్మ కోపంగా వుందేవిటే!"

"వుండదూ! సరుకు తెమ్మని కొట్టుకు పంపుతే ఇంటికి తిరిగి రావాలన్న జ్ఞానమేమన్నా వుందా నీకూ!"

"ధనియా లెప్పుడో తెచ్చాసేనే.... అక్కా! అమ్మకి నువ్విచ్చెయ్యవే!"

"నాకెందుకు తద్దినం - నువ్వే ఇచ్చు.కో!"

"నన్ను కొడుతుందేమోనే— అక్కా కొంచం ఇవ్వవే."

"కొడితే ఏడుస్తూ కూచో, ఏం, చెప్పిన పని చెయ్యకపోతే కొట్టక ముద్దెట్టుకుంటుందా?"

"తెచ్చేశాను కదే అక్కా"

"నేను రాకపోతే ఎప్పటికొచ్చేదానివి?"

"వొచ్చేస్తున్నానే, కమల ఏదో అడుగుతుంటేనూ."

"నాకేం తెలీదు. నువ్వెళ్ళి ఇచ్చుకో."

"ఏమడిగిందేవిటి. కమల?"

"ఆడుకుందాం, వొస్తావా అంది."

"వారం రోజుల్లో పరీక్షలు పెట్టుకుని ఆడలాడతా వన్నమాట. ఆటలు."

"అన్నీ వొచ్చేసునే నాకు, పజ్యాలూ, ఎక్కాలూ...."

"అబ్బో! పెద్దపండితు రాలివై పోయావు మరి. ఇక పుస్తకం ముట్టక్కర్లేదు."

"రాత్రుళ్లు చదువుకుంటాగా? కమలావాళ్ళు ఆడుకోడంలేదూ?"

"వాళ్ళెప్పుడన్నా పుస్తకం ముట్టుకోవడం చూశావా? ఎప్పుడూ కాకుల్లాగ తిరుగుతారని అమ్మ అనదూ? ఎండలోనూ వాళ్ళే, వానలోనూ వాళ్ళే.... ఛ! ఏం పిల్లలో! నడవ్వేం నువ్వు?"

"వస్తున్నాగా? అక్కా! వాళ్ళంతా అనక సినిమా కెళ్తారటే."

"బుద్ది లేకపోతేసరి ఎన్ని సినిమాలు చూస్తారు నెలకి? చూస్తే చూస్తారు. వాళ్ళకేం డబ్బొచ్చి పడుతుంది. అమ్మ అనదూ. వాళ్ళ నాన్న అన్నీ వెధవ పనులే చేసి గడిస్తాడట"

"మన నాన్న కూడా వెధవ పనులు చెయ్యడనా?"

"చాల్లే నోరుముయ్యి వెధవ పనులూ చెయ్యమంటావు. ఇంకే మన్నానూ చెయ్యమంటావు"

"ఏమ్మా! తప్పా? చక్కగా డబ్బొస్తుందిగా!"

"డబ్బేనా ఏవిటీ? మంచి మర్యాదా వుండక్కర్లేదూ వెధవ పనులు చేస్తే అమ్మ వూరుకుంటుందా?"

"వెధవ పనులంటే ఏవిటే అక్కా?"

"నీకేం తెలుస్తుంది? చిన్నపిల్లవి. వూరుకో.

"పోనీలేమ్మా. నాకెందుగ్గానీ కమల గౌను యెంత బాగుందోనే అక్కా! చూశావా. నువ్వూ?"

"ఆఁ! చూడలేం? దాని కుచ్చులూ, అదీనూ! వాళ్ళకి తగ్గ గౌన్లే అవి. రౌడి గౌన్లు."

"అంతా బడాయి. కుచ్చులు పెట్టుకుంటే యేమవుతుందేవిటీ?.... అక్కా, కమలావాళ్ళతో మనం కూడా వెళ్దామే సినిమాకీ"

"అమ్మ వీపు బద్దలు కొడుతుంది."

"ఎందుకు కొడుతుందేవిటీ? అందరూ వెళ్తారుగా. అమ్మ వెళ్ళదూ మనల్ని వొదిలేసీ?"

"వెళ్తే వెళ్తుంది. పెద్దవాళ్ళతో నీకు సాపత్యమా?.... అలా వెనక్కి వెనక్కి చూస్తావేవిటే? అసలు యింటికి వస్తావా, రావా? అన్నట్టు మరిచేపోయాను. అమ్మ నీకూ, నాకూ గాజులుకొంది. నీకు ఎఱ్ఱవీ, నాకు ఆకు పచ్చవీ.... ఎంత బాగున్నాయో."

"ఛీ! నాకేం అక్కర్లేదు వెధవ గాజులు. ఆ డబ్బుల్తో సినిమా కెళ్తే...."

"సినిమా, సినిమా అని పట్టించావేమిటి? పిచ్చి మొద్దూ! కడుపు నిండుతుందా, కాలునిండుతుందా? ఆడపిల్లల చేతులు గాజుల్లేకపోతే ఏడిసి నట్టుంటాయని అమ్మ విసుక్కోదూ."

"చేతులెక్కడన్నా ఏడిసినట్టుంటాయా? నా చేతులు చూడు ఎంత బాగున్నాయో నాకేం గాజులక్కర్లేదు. మళ్ళీ అవి బద్దలైపోతే పోట్లాడు తుంది. కమలావాళ్లు గాజులెప్పుడూ వేసుకోరు."

"ఆ సమానూ ఆ వెధవల పేరెత్తకు నాకు వళ్లుమండుతుంది. వెధవ స్నేహాలు చేసి చెడుతున్నావు. సాయంత్రం లక్ష్మి పిన్నిగారింటికి పేరంటానికెళ్ళాలని అమ్మ గాజులు కొంటే.... వాళ్ళ పాపాయికి చెవులు కుట్టిస్తున్నారు తెలుసా?"

"అమ్మో అంత చిన్న పాపాయి ఏడవదూ?"

"ఏడిస్తే అదే వూరుకుంటుంది. ఇవ్వాళే మంచి రోజట. మళ్ళీ మంచి రోజు రావొద్దూ?"

"ఏమో! నేనేం పేరంటానికి రాను. నా డబ్బులు నా కిచ్చెయ్యండి సినిమాకి పోతాను కమలా వాళ్ళతో."

"ఆఁ నీ డబ్బులు, నీ తాత గడించాడు అమ్మతో చెపుతానుండు. కాళ్ల విరగ్గొడతే కుదురుతుంది నీ తెగులు."

"ఎందుకు విరగ్గొడుతుందేం? కాస్త పరుగులెత్తితే 'కాళ్ల విరగ్గొట్టు కుంటారర్రా అని అరుస్తుందిగా' తనెందుకు విరగ్గొడుతుందేం?"

"ఏం చేస్తుంది పెంకి వేషాలేస్తే?"

"అక్కా! అక్కా! కమల నాటకంలో వేషం వేస్తోందంటే. మేష్టారు వెయ్యమన్నారట."

"ఛీ! ఛీ! పాడు వేషాలు. ఏం చేసినా వాళ్ళకే తగును."

"ఏమ్మా తప్పా? సరదాగా నాటకంలో వేస్తే?"

"సరదా ఏమిటి? సిగ్గుండక్కర్లా? అందరి ముందూ ఎలా గంతు లేస్తారు బాబూ!"

"గంతులెయ్యక్కర్లేదే. కృష్ణుడూ, రాధా పాటపాడుతూ నాటకం వేస్తారట అంతే. నన్ను రాధ వేషం వెయ్యమందే కమల."

"అదా సంగతి? మరి చెప్పవేం? వాళ్ళతో బైల్దేరు. నిన్ను సిని మాల్లో కూడా చేరుస్తారు."

"అమ్మో! సినిమాల్లోనే. ఎంత బాగుంటుందోనే"

"చాల్లే నోరుమియ్యి. పేట్రేగి పోతున్నావు.

"సీతపిన్ని అందరిముందూ వీణవాయిస్తే ఎంతో బాగుంధని మెచ్చుకున్నారుగా? సినిమాల్లోకి పనికొస్తుందన్నారూ."

"అది వేరు. వీణ అంటే సరస్వతో సమానం. చక్కగా తివాసీ మీదకూచుని వీణ వాయిస్తుంది సినిమాలోలా గంతులేస్తుందనుకున్నావా? ....పదవే తల్లీ తొందరగా అమ్మ ఏం కేకలేస్తోందో."

"ధనియాల్లేకపోతే ఏం మునుకు పోతుందేం? కూర వండేసుకో కూడదూ?"

"ఎవరు నేర్పుతున్నారు నీ కివన్నీ? దేనికేది పడాలో అది పడక పోతే హోటల్లో వంటల్లాగ ఏడుస్తాయని అమ్మ అనదూ?"

"అక్కా! హోటల్లో యెంత బాగుంటుందే! మనం మామయ్యగారి వూరు వెళ్ళేప్పుడు స్టేషను దగ్గర హోటల్లో తినలేదూ? ఎంతబాగున్నాయో ఇడ్లీలు."

"అయితే నువ్వు వంటా అదీ నేర్చుకోకు. హోటల్లోనే మింగు."

"అబ్బా! అల్లాగైతే ఎంత బాగుంటుందో నాకు ఎంత బాగా వండినా హోటల్లో తింటారెందుకండీ?" అని అమ్మపోట్లాడదూ నాన్నతో? నాన్నకీ, నాకూ అంతే."

"నాన్నతింటే తింటాడు మొగాళ్ళకేవిటి? యెల్లా చేసినా చెల్లుతుంది. వాళ్ళ డబ్బు వాళ్ళ యిష్టం. నాన్నలాగ నువ్వు చేస్తావా?"

"అక్కా మొగాళ్ళకి డబ్బు లెవరిస్తారే?"

"ఒకరిచ్చేదేవిటి? వాళ్ళే వుద్యోగాలు చేస్తారు."

"వూఁ చేస్తే?"

"చేస్తే ఏవిటి నీ తలకాయ. అందుకే వాళ్ళదగ్గర డబ్బుంటుంది. ఎక్కడేది తినాలన్నా తింటారు.

"అయితే నేనూ వుద్యోగం చేస్తాను."

"ఏడిశావులే. అమ్మ వొప్పుకుంటుందను కున్నావా? నేనూ నీలాగే అనుకున్నాలే చిన్నప్పుడు."

".... .... .... .... ...."

"నిలబడ్డావేమిటి? రావేం లోపలికి?"

"అమ్మ కొడుతుందేమోనే అక్కా, నువ్వు తీసుకుపోవే ఇవి-నా కాలికి దెబ్బ తగిలిందని చెప్పెయ్యవే."

"దెబ్బ తగిలిందేం నీ కాలికి?" ఎక్కడ నేర్చావు ఈ వేషాలన్నీ? అమ్మదాకా ఎందుకు. నేను లేనూ? నీ రెండూ నీకు పడితేగానీ...."

అక్క చెల్లెలి జడ గట్టిగా పట్టుకుని తలకాయ వంచి వీపుమీద దబ దబా చరవడం మొదలుపెట్టింది.

చెల్లెలు అక్కచేతిలో పెనుగులాడుతూ నేలమీద దొర్లుతోంది.

అక్క కొడుతూనేవుంది.

చెల్లెలు ఏడుస్తూనేవుంది.

దెబ్బలు తినే చెల్లెలికి—ఏడేళ్లు.

దెబ్బలు కొట్టే అక్కకి—పన్నెండేళ్లు.

[25-1-1980 "ఆంధ్రజ్యోతి"— వారపత్రికనించీ]